



అతి నిశ్శబ్దంగా ఉంది అడవి, నవమినాటి

వెన్నెల చెట్ల ఆకులపై బడి వెండి రేకుల్లా మెరుస్తోంది. కీచురాళ్ళరొది- అడవి జంతువుల అరుపులు.అప్పరసల క్రీంకారాల్లా- అడివి ముని నిశ్శబ్దాన్ని భంగపరుస్తున్నాయి. ఆకుల చాటునో పూరేకుల మాటునో—ఎక్కడ ఏ చెట్టు నీడన నా తార దాగుందా అని వెతుక్కుంటూ వెళుతున్నాడు ఆకాశ మార్గాన చంద్రుడు.

నిటారుగ-నిశ్శబ్దంగా నడుస్తున్న రంగడి పాదాల కింద పడి ఎండుటాకులు గరగరమంటున్నాయి. అతడి కళ్ళు చురుగ్గా—నిశితంగా పరిసరాల్ని గమనిస్తున్నాయి. నిశ్శబ్ద నిశీధిలో ఒంటరిగా నడుస్తున్న అతడికి ఆలోచన్లు తోడుగా నిలిచాయి.

అడవి మధ్యకు చేరిన రంగడు,పరిసరాల్ని గమనిస్తూ—తన లక్ష్యానికి దగ్గిరలో – ఒక చెట్టెక్కి కూర్చున్నాడు. చాల సేపట్నించి నడిచాడేమో—అలసటతో ముఖంమీది స్వేద బిందువులు—తామరాకు మీది వాన చినుకుల్లా వెన్నెల్లో వింతగా ప్రకాశిస్తున్నాయి.

మీది బొత్తాలు రెండు వదులుచేసికొని చొక్కాను పైకి లాక్కున్నాడు గాలికి వీలుగా బేగ్‌లోంచి నీళ్ళు కొన్ని తాగేసరికి-నడిచి వచ్చిన అలసట తీరినట్టనిపించింది.

సిగరెట్ వెలిగించాడు. సిగరెట్ పొగను రింగులు రింగులుగా వదులుతూ .. పరిసరాల్ని గమనిస్తూ కూచున్నాడు- ప్రక్కనే తుపాకీ కొండచిలువలా ఉంది.


రింగులు తిరుగుతూ గాల్లో కలిసిపోతున్న సిగరెట్ పొగ గొప్ప అనుభూతిని. ఆనందాన్నియిస్తోంది. ఆ రింగుల్ని చూస్తుంటే మల్లి గుర్తొస్తోంది. మల్లి ఉంగరాల జుత్తు గుర్తొస్తుంది. "మావా"-అని తియ్యని మత్తైన పిలుపు గుర్తొస్తుంది.

మనసంతా-మల్లి తలపులతో – మత్తుగా ఉంది. ఇపుడు మల్లీ ఏం చేస్తుంటుందో??

వెన్నెల రాత్రుల్లో ఒంటరిగా – ఒక్క రాత్రయినా కోర్కెలను అణచుకోడం ఎంత కష్టం.

ఆలోచిస్తున్న రంగడికి - ఎక్కడో..ఏదో అరుపు వినబడడంతో ఉలిక్కి పడ్డాడు. తుపాకీ పట్టుకొని చుట్టు ప్రక్కలందు అతి





శ్రద్ధగా పరిశీలిస్తూ కూచున్నాడు.


❊ ❊ ❊

# మనుష్యులవేట

పి. ఈశ్వరరావు

రంగడికి సుమారు పాతికేళ్ళుంటాయి. బలిష్ఠమైన శరీరం మీద ఆరడుగుల పొడ వున్నట్టు అనిపించదు. అతడి కళ్ళు — పిల్లి కళ్ళలా - గోధుమ రంగులో ఉంటాయ్. అతడి చూపు— గద్దచూపులా. తీక్షణంగా ఉంటుంది. పంతానికి - పౌరుషానికి సాక్ష్యంగా ఉంది. మోటుగా ఉన్న క్రింది పెదవి.

తండ్రి ఎపుడో చిన్నపుడే చనిపోయాడు.



తల్లి కూడ రెండేళ్ళ క్రితమే పోయింది. తల్లి పోయినపుడే మిలట్రీ నుండి వచ్చేసాడు- మిలట్రీ అంటే విసుగెత్తి—తల్లి కూడ పోవ డంతో ఉన్న రెండెకరాల పొలాన్ని చూసు కుంటూ ఇక్కడే ఉండిపొమ్మని బంధువులు. శ్రేయోభిలాషులు చెప్పడంతో కాదనలేక పోయాడు.

మల్లి అతడి జీవితాన్ని పంచుకుని ఓ వసంతం గడిచింది.

మల్లి — మల్లెపూవులా తెల్లగా - చంద మామలా మరీ అంత చక్కగా ఉండక పోయినా నల్ల కళ్ళద్దాలతో చందమామని చూసినట్టు ఉంటుంది. నలుపులో. అదో వింత మెరుపు. మరోసారి చూడాలనిపించే శరీర సౌష్ఠవం. చేప పిల్లలాంటి కళ్ళు - మల్లెపూవు లాంటి నవ్వు.

ఊరికి చివరగా — తన పొలాన్నే ఆను కుని ఒక చిన్న గుడిసె నిర్మించుకున్నాడు- రంగడు. తమ అభిరుచుల కనుగుణంగా. మల్లితో తను పంచుకోబోయే ప్రణయలోకపు టానంద విహారాలకు ఏ ఒక్కరి అడ్డూ లేకుండా. గుడిసె ముందు చిన్నపూల తోట. మల్లె—కనకాంబరం. గులాబీల పరిమళాలు కలగలసి ఓ కొత్త—వింతైన సువాసలను వెదజల్లుతూ ఆ యువ హృదయాలను మత్తె క్కిస్తుంటే-ఆ తోటలో — మల్లి ఒడిలో తల దాచుకుని — కళ్ళతో పలకరించుకుంటూ — ఎన్ని వెన్నెల రాత్రులు గడిపారో; ఎన్ని తీయని తలపుల్ని గుండెల్లో అతి భద్రంగా దాచుకున్నారో

❊ ❊ ❊

మల్లి పక్కనలేని రాత్రి కాళ రాత్రిలా ఉంటుంది. అందుకే ఈ రాత్రి చాల చికాకుగ ఉంది. అయినా తప్పదు. నారిగాడి కోసం—ఆ చిన్నారి ఆత్మశాంతికోసం - మిలట్రీలో చూపడాన్ని అవకాశంరాని తన ధైర్య సాహసాలు - తన ఊరి ప్రజలకు చూపాలి

విజయోత్సాహంతో తను వస్తున్నపుడు మిల మిల లాడే మల్లి కళ్ళలోని మెరుపులు చూడాలి.

పిచ్చి మల్లి! తనకే అపాయం కలగ కూడదని పేరు పేరునా-పైడితల్లమ్మకి, అంకాలమ్మకీ—ఏడుకొండల ఎంకన్న సామికీ-దండాలు పెట్టేసి-ముడుపులు కట్టింది.

మొక్కు కోసం కాకపోయినా — మల్లితో కలసి ఏడుకొండల దూరం నడవడానికయినా సరే—తిరుపతి వెళ్ళాలి.

"అన్నా....అన్నా" అని తన వెంటతిరిగే వాడు నారిగాడు. మల్లి కయితే వాడు కొడుకే.

❀ ❀ ❀

అనాధగా తిరిగిన నారిగాడికి-బుగతగారి గొడ్లను అడవికి తీసికెళ్ళి మేపడమే జీవనోపాధి. అడవిని నమ్ముకున్న నారిగాణ్ణి - ఆ అడవే మృత్యువై చిరుత పులి రూపంలో కబళించింది.

ఒక్కసారి—ఊరు గగ్గోలు పుంది. అడవిలో పులి తిరుగుతుంది. నారిగాణ్ణి పులి చంపేసింది. రచ్చబండ మీద విన్నా-రామాలయంలో ఉన్నా ఇదే చర్చ.

అడవిలోకి రాకపోకలు బందయ్యాయి

కాని ఎన్నాళ్ళు మానెయ్యడం?

మానేస్తే ఎలా బతకడం??

గొడ్లను మేపకుంటే గింజలు కొలవరు పెద్దోళ్ళు!

కట్టెలు కొట్టి—తెచ్చి అమ్ముకోకపోతే



కాసులురావు!!

కాని—పులి!

నారిగాణ్ణి పొట్టన బెట్టుకున్న పులి!

అటు చూస్తే పులి!

ఇటు చూస్తే ఆకలి!!

అడవి కెళ్తే నే ఆకలి తీరుతుంది.

అడవి కెళ్తే నే ఆయుష్షూ తీరుతుంది.

ఆకలితో మాడి చావడమా?

పులికి ఫలహారం కావడమా!??

ఎటూ తేల్చుకోలేక-ఆకలితో నకనకలాడుతున్న పిల్లల్ని చూడలేక-తల్లడిల్లి పోతున్నారు బీదా బిక్కి చాలమంది.

తోటి వాళ్ళ బాధల్ని చూడలేక—నారిగాడి ఆత్మశాంతి కోసమైనా — చావడమో - చంపడమో జరగాలని మిలట్రీ ధైర్యంతో అడవికి బయలుదేరాడు రంగడు.

❀ ❀ ❀

అర్ధరాత్రి దాటి పోతోంది. వెన్నెల బాగా పరచుకుంది. వెన్నెల్లో - క్రిందినేల—పాలు పోసినట్లుంది. పులి జాడలేదు. కనీసం పులి అరుపుకూడ వినబడటంలేదు. కర్ఫ్యూ విధించిన నగరంలా ఉంది అడవి.

గంటలు గడుస్తున్నా-ఏ అలికిడీ వినబడటం లేదు. ఎలాగైనా - పులిని మట్టుబెట్టాలన్న పట్టుదలతో చాల దీక్షగా ఎదురు చూస్తున్నాడు.

సిగరెట్లు అయిపోయాయి. దాహంకూడ వేస్తోంది. కాలం గడుస్తున్న కొద్దీ విసుగనిపిస్తుంది. అందమైన వెన్నెల రాత్రి వృధాగా పోయిందే అని కోపంగా కూడ ఉంది.

తాపాన్ని రేపుతున్న వెన్నెల!

మల్లి నవ్వును తలపించే వెన్నెల!!

మళ్ళీ మనసంతా మల్లి తలపులు....

అంతలో—

మబ్బుల క్రమ్మి ఉరుములు ఉరిమినట్లు

ప్రశాంతంగా నిద్రిస్తోన్న పల్లెని కార్చిచ్చు దోచుకున్నట్టు.

అగ్నిపర్వతం బద్ధలయినట్టు

"మాఁవా!! మాఁవా!!" అన్న పిలుపు.

రంగడు ఉలిక్కి పడ్డాడు.

ఆ పిలుపు, అవునా పిలుపు....

తన మల్లిదే.

ఏం .... ఏమైంది ....? ఆ గొంతులో ఎందుకా బాధ ....??

ఎందుకు ....? ఎందుకొచ్చింది .... ఈ అర్ధరాత్రి.??

జవాబు దొరకని ప్రశ్నలు కందిరీగల్లా ముసురు కున్నాయి.

ఒక్క ఉదుటున గెంతాడు. పిలుపు వినిపిస్తున్న వైపు .... ఊరివైపు.

తుపాకీ గుండు కన్న వేగంగా!

తుఫాను కన్నా తొందరగా!!

దూరంగా మల్లి — తనవైపే వస్తూ — పగరుస్తూ — తననే పిలుస్తూ ....

"మల్లీ !! " - అటవి ప్రతిధ్వనించిందా?

భూకంపం వచ్చిందా!?!

రేగిన జుట్టుతో-

చినిగిన బట్టలతో-

ఒంటి నిండా గాయాలతో

ఎర్ర మల్లెలా — "మాఁవా" అని ఒక్కన జేరి భోరునఏడ్చింది.

"ఏం జరిగిందీ మల్లీ ...." బాధతో - దుఃఖంతో


"మాఁవా! అయిపోయింది. నా బతుకు బుగ్గయి పోయింది. ఆ మృగం .... చిన బుగత .... అన్ని - నన్ను - మనింటి వెనక మాఁవి తోటలో .... " వెక్కిళ్ళ మధ్య బాధతో ....

నిర్జీవంగా .... ఒడిలో వాలిన .... వాడిన మల్లెతీగ,

ఒక్కక్షణం క్రితంవరకు - తనఊహల్లో విహరించిన వలపులరాణి!

తనని ఊరించి వేధించిన వెన్నెల బొమ్మ!

తన గుండె గుడిలో నిలచిన అనురాగ దేవత!!



ఇపుడిలా - తన ఒడిలో - నిర్జీవ ప్రతిమలా ....

తన నెవరో-
రాకాసి లోయలోకి విసిరేసినట్టు!
అడవి సింహాల మధ్య కట్టి పడేసి నట్టు!!
అగ్ని గుండంలోనికి తోసేసినట్టు!
కలకాని నిజం!
కలయితే బాగుండుననే నిజం!!
గుండెల్ని పిండి చేసే నిజం!!!
జరిగింది క్రమంగా గుర్తొస్తుంటే-
నిశ్చేష్టుడైన రంగడు.
కోపంతో - ఎరుపెక్కిన కళ్ళు.
బిగిసిన పిడికిళ్లు
దు:ఖంతో బరువెక్కిన గుండె.
గుండె నిండా మంటలు - ప్రతీకార జ్వాలలు.

* * *

మనుషుల్ని చంపుకు తింటాయ్ క్రూర మృగాలు అవి అడవుల్లోనే నివసిస్తాయి వాటిని మనం గుర్తించగలం.

కాని-మనుషుల మధ్యనే నివసిస్తూ
క్రూర మృగాల కన్న క్రూరంగా-
అడవి జంతువుల కన్న హీనంగా-
అతి దారుణంగా-ప్రాణాల్ని, మానాల్ని దోచుకునే భయంకరమైన మనుషుల మధ్యన జీవిస్తున్నాం మనం.

పులిని చూసి పులి బెదరదు, వాటిలో ఏ జాతీ మరో జాతికి శత్రువు కాదు.

కాని-తన మేధస్సుతో-
అంతరిక్షాన్ని అధిగమించిన మనిషి!
అణ్వస్త్రాలను తయారు చేసిన మనిషి!!
మహా మేధావి - సాహసీ
మరో మనిషికి శత్రువు.

క్రూరమృగాల్ని వేటాడి చంపితే జేజేలు కొడతారు, కాని అంతకన్న క్రూరమైన మానవ మృగాల్ని-???

* * *


మూర్తీభవించిన రౌద్రంలా!
ప్రళయకాల యముడిలా!!
అడవినే కాల్చేసే చూపులతో.
ఆవేశం నడుస్తోన్నట్టు-
పాపం పగిలి పోతున్నట్టు
భుజాన మల్లితో - త్వర త్వరగా అడుగు లేస్తున్న రంగడు.

తోటలో-
మత్తెక్కిన కళ్ళతో-మైమరచి నిద్రిస్తున్న బుగత.

"ఒరేయ్!:" సముద్రం గర్జించినట్టు-
పిడుగులు కురిసినట్టు
ఎదురుగా భుజాన మల్లితో- ఎక్కుపెట్టిన తుపాకితో-మృత్యువు నిలబడినట్టు

భయంతో గజ గజ వణికాడు చిన బుగత, తుపాకీ గర్జించింది, తోటంతా ప్రతిధ్వనించింది.

## చదువు, సంస్కారాలు కావాలి



నా కాబోయే ప్రియసఖి నేటి సగటు స్త్రీలా కాక అభ్యుదయ భావాలు కలిగి ఉండాలి. తను నమ్మిన సిద్ధాంతం కోసం ఎవరినైనా ఎదిరించగల వ్యక్తిత్వం కలదై ఉండాలి. పది మందిలో సరదాగా, కొత్త. పాత అనేది లేకుండా కలిసిపోయేలా ఉండాలి. చదువు. సంస్కరణాభిలాష కలిగి-స్త్రీల సమస్యలు. నేటి రాజకీయాల పట్ల అవగాహన ఉండాలి. కుల మతాల పట్టింపులుండకూడదు. కట్నకానుకలను వ్యతిరేకించాలి. ఇలాంటి యువతి తారసపడితే ప్రేమించి పెళ్ళి చేసుకుంటాను నేను బి.ఎస్సీ. ఫైనల్ చదువుతున్నాను

సింహాద్రి రామాంజనేయులు. కేరాఫ్ కె.పి. తాయారమ్మ మామిడితోట. డోర్ నెం: 2/203. వర్రెగూడెం. మచిలీపట్నం-521 001.

# మగవారికి ప్రత్యేకం

## నేను అలా కాదు

నా పేరు కె. గోవిందరెడ్డి మద్రాస్‌లో కంప్యూటర్ సైన్స్. ఎం.బి.ఎ చదువుతున్నాను.


నా వయసు 22 సంవత్సరాలు. ఎత్తు 5 అడుగుల 9అంగుళాలు. నేను ఆదర్శభావాలు గల వ్యక్తిని చేసుకోవాలనుంది. కుల. మత ఆస్తి, అంతస్థులు అనే భావాలు లేవు.

మీ (మా) మయూరి పత్రికలో 29-11-1985లో మహిళాలోకంలో "కన్నెపిల్లకలలు" శీర్షికలో ఎం: గీతారెడ్డిగారు రాసిన మొదటి పేరా నాకు నచ్చింది.

ఆమె రాసిన "జీవితంలో పదిమందికిదారి చూపెట్టాలని ఆదర్శ వివాహం చేసుకోవాలనుంది" అని రాశారు ఇది బాగుంది.

పోస్ట్ గ్రాడ్యుయేట్ లేదా గ్రాడ్యుయేటో అయ్యివుండి హోదాగల ఉద్యోగం చేస్తుండాలి అని రాసారు. ఇది మొదట రాసిన దానికి భిన్నంగా ఉంది.

"చూడండి! ఆదర్శ వివాహము చేసుకొనే వారికి హోదా, అంతస్థు. డిగ్రీలు అవసరం లేదు కదా! వారు అన్నట్లు పది మందికి ఆదర్శంగా నిలవచ్చుకదా!



మూడవ పేరాలో రెడ్డికులం వరుడు కావాలని రాసారు రెండవ పేరాలో ఛాందస భావాలు ఆధునిక భావాలు కాకూడదని రాశారు ఛాంధస భావాలు ఆధునిక భావాలు తమ కులస్థుడు కావాలని కోరుకోవడం సనాతన దురాచారాలను ప్రోత్సహించడం కాదా పైకి ఆదర్శ వివాహమంటూ రాయడం ఏమంత సమంజసంగా లేదని అభిప్రాయపడుతున్నాను.

అయితే నేనుమాత్రం యిలా కాదు.

కె జి. రెడ్డి